క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామి

కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల్లో భాగంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీతపై ప్రవచనాలు అందించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి వార్లను దర్శించుకున్నారు.

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పీఎం పాలెం: స్థానిక తులసీనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గాదె రోసిరెడ్డి కళావేదిక వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గీతం (జిమ్‌సర్)ఆస్పత్రి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సుమారు 250 మందికి వైద్యపరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక వాకర్స్ అసోసియేషన్ చైర్మన్ పి.సన్ని, సెక్రటరీ లోవరాజు, కళావేదిక కమిటీ చైర్మన్ కేఎస్‌పీ ప్రమోద్ చక్రవర్తి, వెంకటరాజు, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కానరాని హెచ్చరికలు.. ప్రమాదకరంగా పనులు



మాస్టర్‌ప్లాన్ రోడ్డులో హెచ్చరిక బోర్డు లేకుండా చేపట్టిన విద్యుత్ పనులు

మధురవాడ: నగరంలో విద్యుత్ శాఖ నిర్వహిస్తున్న అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులను కాంట్రాక్టర్లు ఇష్టానుసారం చేస్తున్నారు. ఆదివారం ఉడా కాలనీ–తిమ్మాపురం మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఉడా హరిత వద్ద ఈ పనులు చేపట్టారు. ఇక్కడ ఐటీ జంక్షన్ నుంచి హరిత అపార్ట్‌మెంట్‌కు వెళ్లే రోడ్డును పూర్తిగా, హరిత నుంచి ఐటీ జంక్షన్‌కి వెళ్లే రోడ్డును పాక్షికంగా తవ్వేశారు. కాని ఎక్కడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ప్రమాదాలకు తావిచ్చేలా చేస్తున్న ఈ పనులపై వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె ఆరో రోజు ఆదివారం కూడా కొనసాగింది. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లతో ఈనెల 20 నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు దిగాయి. అయితే యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడం వల్ల ఉత్పత్తికి పెద్దగా అంతరాయం కలగడం లేదని సమాచారం.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..



చిట్టివలస రైతు బజారు

- చిట్టివలసలో అందుబాటులోకి వచ్చిన రైతుబజారు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.78 లక్షలతో నిర్మాణం
- ఇటీవలే ప్రారంభం
- స్థానికుల హర్షం

తగరపువలస: చిట్టివలసలో రైతుబజారు ప్రారంభంతో ఈ ప్రాంత ప్రజల మూడు దశాబ్దాల కల నెరవేరింది. ఇన్నాళ్లు రైతుబజారు అందుబాటులో లేని కారణంగా స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకే కొనుగోలు చేయవలసి వచ్చేది. మరోవైపు సొంతంగా సాగు చేసుకునే రైతులు కూడా ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయాలు సరిగ్గా జరపలేకపోయేవారు. ఈ బజారు ఏర్పాటుతో అటు వినియోగదారులకు, ఇటు రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంది.

ప్రైవేట్ మార్కెట్ కంటే సగం ధరలకే..

కొత్తగా రైతుబజారుకు వచ్చిన వినియోగదారులు ఇక్కడి ధరలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రైవే ట్ మార్కెట్‌లో కంటే దాదాపు సగం ధరలకే రైతు బ జారులో కూరగాయలు, ఆకుకూరలు లభిస్తున్నా యని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ఆనందపురం, విశాఖ, విజయనగరం వంటి దూర ప్రాంతా లకు వెళ్లకుండా, సరసమైన ధరలకు కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులో ఉన్నాయంటున్నారు.



రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరల విక్రయాలు

ప్రచారం చేయాలి

చిట్టివలసలో రైతుబజారు ప్రారంభించిన సంగతి పూర్తిగా ప్రచారంలోకి రాలేదు. భీమిలితో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలిసినా తగరపువలస, చిట్టివలస, సంగివలస పరిసర ప్రాంత ప్రజలకు ఇంకా తెలియకపోవడంతో ప్రైవేట్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన తరువాత రైతు బజారులో ధరలను పోల్చి చూసుకుని లబోదిబోమంటున్నారు. పూర్తి స్థాయిలో దుకాణాలు ప్రారంభించి, ప్రచారం కల్పించాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

అందుతున్న అభివృద్ధి ఫలాలు

భీమిలి ప్రజల కోరిక మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో కీలకమైన చిట్టివలసలో రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మించి అందుబాటులో ఉంచింది. దాని ఫలాలు ఇప్పుడు ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు అందుతున్నాయి. నాలుగు రోజుల క్రితం రైతుబజారులో విక్రయాలు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం 14 దుకాణాలలో విక్రయాలు ప్రారంభం అయ్యాయి. పూర్తి స్థాయిలో 31 దుకాణాలు ప్రారంభం అయితే 50కు పైగా ఆకుకూరలు, కూరగాయలు, 15 రకాల పండ్లు, పదుల సంఖ్యలో పువ్వుల దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి.



పార్కింగ్ సమస్య లేదు

ప్రైవేట్ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు పార్కింగ్ సమస్య, వ్యాపారులకు టాయిలెట్ల సమస్య ఎక్కువగా ఉండేది. రైతు బజారులో విక్రయాలు ప్రారంభం కావడంతో అన్ని సమస్యలకు పరిష్కారం దొరికినట్టయింది.

– ఏలూరు రాంబాబు, తగరపువలస

కూరగాయలు (కిలో)	ధర రూ.				
వంకాయలు (నల్లవి)	20	వెల్లుల్లి	100	కీర	28
(తెల్లవి)	36	అల్లం	54	పొట్లకాయ	28
దొండ	18	గోరు చిక్కుడు	32	చిలగడ దుంప	38
బెండ	18	డ్రాగన్ ఫ్రూట్	75	కంద	64
బీర	32	కాకర	32	కరివేపాకు	35
ఉల్లి	19	చిక్కుడు	40	క్యాప్సికమ్	54
బంగాళాదుంప	19	క్యాబేజీ	16	చేమ దుంపలు	38
దోస	16	క్యారెట్ మట్టితో	30	**ఆకుకూరలు**	
ఆనపకాయ ఒక్కటి	14	క్యారెట్ శుభ్రం చేసినవి	40	పుదీనా, కొత్తిమీర కట్ట	5
బరబాటి	54	ముల్లంగి	30	గోంగూర, తోటకూర,	
టమాటా	17	నిమ్మకాయలు	80	పాలకూర కట్ట	3
మునగ	54	అరటికాయ (ఒకటి)	7	**పువ్వులు**	
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	28	చామంతి	350
		బీన్స్	98	గులాబి	250
		పొటల్స్	18	బంతి	120



తాజాగా, చవకగా..

రైతు బజారులో లభిస్తున్న కూరగాయలు తాజాగా ఉండటమే కాకుండా మార్కెటింగ్ విభాగం సూచిస్తున్న తక్కువ ధరలకు లభిస్తున్నాయి. గతంతో పోలిస్తే డబ్బులు చాలా వరకు ఆదా అవుతున్నాయి.

–జీరు గంగాభవాని, జీరుపేట



దళారుల బెడద లేదు

రైతుబజారులో విక్రయించే వారంతా పంటలు సాగు చేసే రైతులే కావడంతో దళారుల బెడద ఉండదు. దీంతో దుకాణంలో అయినా ఒకటే ధర ఉంటుంది. నాలుగు రోజుల క్రితంతో పోలిస్తే కొన్ని ధరలు తగ్గాయి.

– చిల్ల రాము, గుడివాడ



అన్ని దుకాణాలు ప్రారంభించాలి

నిర్మించిన మొత్తం దుకాణాలు ప్రారంభించి, ధరల పట్టికలో పేర్కొన్న కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పువ్వులు అన్నీ విక్రయించేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే రైతుబజారు లక్ష్యం నెరవేరుతుంది.

– చేట్ల తాతయ్యరెడ్డి, సంతపేట



అందుబాటులో వాష్‌రూమ్‌లు

పేద కళాకారులకు చేయూత



సమావేశంలో పాల్గొన్న కళాసాహితి సభ్యులు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఉన్న పేద కళాకారులు చేయూతను ఇవ్వనున్నట్లు కళాసాహితి సంస్థ అధ్యక్షులు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ తెలిపారు. ఆదివారం జరిగిన కళాసాహితి సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన పలువురు కళాకారులు ఉన్నారన్నారు. గతంలో వారికి మంచి గుర్తింపు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాంటి వారికి తమవంతు సహకారం అందించేందుకు నిర్ణయించామని, త్వరలో వారిని ఎంపిక చేసి కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

1369 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు

పద్మనాభం: ఖరీఫ్ సీజన్ కోసం 1369.30 క్వింటాళ్ల వరి, వేరుశనగ విత్తనాల కోసం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో వరి విత్తనాలు 1354 క్వింటాళ్లు, వేరుశనగ లేపాక్షి రకం విత్తనాలు 15.30 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపించామన్నారు. వరి విత్తనాలు ఎంటీయూ 1121 రకం 845 క్వింటాళ్లు, సాంబ మసూరి 80 క్వింటాళ్లు, సోనా మసూరి 350 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 రకం నాలుగు క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 75 క్వింటాళ్లు అవసరమని తెలియజేశామన్నారు. వారం రోజుల్లో రైతు సేవా కేంద్రాలకు ఈ విత్తనాలు వస్తాయని, కిలోకు రూ.5 చొప్పున సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా ఉజిడి ఉత్సవం



బంగారమ్మ ఆలయ ప్రాంగణంలో ఉజిడి బండి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభం గ్రామంలో ఉజిడి ఉత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వచ్చే నెల రెండో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు బంగారమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉజిడి ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పద్మనాభం గ్రామంలో ఉన్న అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఉజిడి బండి వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉజిడి బండిని గ్రామంలోని అన్ని వీధుల్లో తిప్పారు. అడుగడుగునా మహిళలు ఉజిడి బండికి పూజలు చేసి, ములంకూర, అన్నంతో చేసిన ఆహారాన్ని ఉజిడి బండి బుట్టలో వేశారు. తదుపరి బండితో పాటు ఆహారాన్ని పద్మనాభం జంక్షన్‌లో ఉన్న బంగారమ్మ ఆలయం వద్దకు తీసుకు వెళ్లి అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు, బుగత రాము పాల్గొన్నారు.

నేడు దేవర సంబరం

పద్మనాభం గ్రామంలో సోమవారం దేవర సంబరం నిర్వహిస్తారు. రాత్రి ఈ సంబరం జరుగుతుంది. కత్తి, కర్ర సాము గరిడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఈ సంబరం జరుగుతుంది. వేడుకలో భాగంగా అమ్మవారిని గ్రామంలోకి తీసుకువస్తారు.

బీచ్‌లో మెరైన్ ఎస్‌ఐ పర్యటన



పర్యాటకులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్‌ఐ మురళీకృష్ణ

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌ను ఆదివారం ఉదయం మెరైన్ పోలీసులు సందర్శించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగరానికి రానున్న నేపథ్యంలో బీచ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు మెరైన్ ఎస్‌ఐ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మురళీకృష్ణ పర్యాటకులు, మత్స్యకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. భద్రత దృష్ట్యా ప్రతిరోజు ఎంతమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శిస్తున్నారు, మత్స్యకారుల పూర్తి వివరాలను సేకరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో పాటు, బీచ్ పరిసరాల్లో స్థానికేతరుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు ఎవరైనా తీర ప్రాంతాల్లో సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

- మెట్ల మార్గం పక్కనే భారీగా గోతుల తవ్వకం
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికార గణం



కొమ్మాది: అది ఓ కొండ ప్రాంతం.. ఆ కొండపై చుట్టూ నివాసాలు.. ఆ నివాసాలకు చేరుకునేందుకు మెట్ల మార్గం కూడా ఉంది. ఇప్పుడు ఈ ప్రాంతానికి పెను ప్రమాదం పొంచి ఉంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని నివాసితులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి మునలయ్యపాలెంలో సొసైటీ పేరుతో కొందరు వ్యక్తులు కొండ దిగువ భాగాన భారీగా గోతులు తవ్వారు. ఇదంతా ప్రభుత్వ స్థలమే.. ఇలా తవ్వడంతో మెట్ల మార్గం కూలిపోయే పరిస్థితిలో ఉంది. తవ్విన ప్రాంతం చుట్టూ ఎటువంటి రిటైనింగ్ వాల్ లేకపోవడంతో పైన ఉన్న ఇళ్లకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే అకాల వర్షాలు భారీగా కురుస్తున్నాయి. ఏ సమయాన ఏ ప్రమాదం పొంచి ఉంటుందో తెలియని పరిస్థితిలో ఇక్కడ నివాసితులు జీవనం సాగిస్తున్నారు.

అధికారులేం చేస్తున్నట్లు?

తవ్వింది అంతా ప్రభుత్వ స్థలం. రక్షణకు ఎటువంటి రిటైనింగ్ వాల్ లేదు. మెట్ల మార్గం పడిపోయే స్థితిలో ఉంది. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా ఓ నిర్మాణాన్ని నిర్మిస్తున్నారు. ఇదంతా సచివాలయానికి కాస్త దూరంలో జరుగుతున్నా ఒక్క రెవెన్యూ అధికారి గానీ, పట్టణ ప్రణాళిక విభా గం అధికారి కానీ కన్నెత్తి చూడడంలేదు. స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఒక కొండను తవ్వాలంటే మైనింగ్, రెవెన్యూ అనుమతులు తప్పనిసరి. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు? జరగ రాని ప్రమాదం జరిగితే ఆ బాధ్యత ఏ అధికారి తీసుకుంటారు. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు అనే ప్రశ్నలు స్థానికులను ఆలోచింపజేస్తున్నాయి. ఓ నాయకుడి అండదండలతో ప్రభుత్వ స్థలం ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు నిద్ర వీడి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిర్మాణం నిలిపివేసి కొండ తవ్విన ప్రాంతంలో రిటైనింగ్ వాల్ తక్షణమే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'అష్టలక్ష్మీ వైభవం'



అష్టలక్ష్మీ వైభవం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో అష్టలక్ష్మీ వైభవం కూచిపూడి నృత్యాంశం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఇంకా.. తెలుగు పద కవితా పితామహుడు అన్నమయ్య విరచిత ముద్దుగారే యశోదా.., గరుడ గమన, నారాయణతే నమోనమో తదితర కీర్తనలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చంద్ర చూడ.., అయిగిరినందిని.., స్వాగతం కృష్ణా.., దీపా తారంగిని.., శంభో శంకర తదితర గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. గీతా మిత్ర నృత్య దర్శకత్వంలో కళాకారులు పవిత్ర, మోక్షజ్ఞ, లక్ష్మీ ప్రణతి, జాస్మిక వీటిని ప్రదర్శించారు.

హృదయపూర్వక సమర్పణమే 'శ్రీకృష్ణ అర్పణం'



నృత్య ప్రదర్శనలో మురళీనగర్‌కు చెందిన కళాకారులు

తగరపువలస: శ్రీకృష్ణునికి హృదయపూర్వక సమర్పణ అందించే కార్యక్రమమే 'శ్రీ కృష్ణ అర్పణం' అని, అందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని అంబరీష దాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలోని శ్రీరాధా మదన్‌మోహనుల మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి 7 వరకు శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమం కనులపండువగా జరిగింది. మురళీనగర్‌కు చెందిన శ్రీ సంజన కూచిపూడి నృత్యాలయం కళాకారులు సంగీతసేవ నిర్వహించారు. అంబరీష దాస మాట్లాడుతూ ప్రతి వారం ఈ ప్రత్యేకమైన శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా భక్తి కళాకారులచే సంగీత, నృత్య, సంప్రదాయ కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శ్రీరాధా మోహనులకు ప్రత్యేక పూజలు చేశారు. జూన్ 1న జరిగే శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో పాల్గొనాలనుకునే కళాకారులు 95425 11108లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తగరపువలస: ఆనందపురం మండలం దుక్కవానిపాలెం జాతీయ రహదారి టోల్‌గేట్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన పువ్వుల వ్యాపారి చొప్పా ప్రశాంత్ (19) గాయపడ్డాడు. ఆనందపురం పువ్వుల మార్కెట్‌లో పువ్వులు కొని చోడవరం వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన గూడ్స్ వ్యాన్ ఇతను ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్ర మాదంలో ప్రశాంత్ కిందపడగా, ఎడమ కాలికి గాయమైంది. వెంటనే చికిత్స కోసం అతడిని సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుని అన్నయ్య నరేష్ ఫిర్యాదు మేరకు సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ బాలంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏదీ నాటి వైభవం?

- భీమిలి తీరానికి ప్రత్యేక ఆకర్షణగా బొమ్మలు
- తుపాను ధాటికి కొట్టుకుపోయిన వైనం
- మళ్లీ ఏర్పాటు చేయాలని కోరుతున్న సందర్శకులు



బీచ్ ఒడ్డున ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పంచ పాండవుల విగ్రహాలు

భీమిలి: సందర్శనీయ ప్రాంతాల్లో ప్రముఖమైన భీమిలి బీచ్ కళ తప్పింది. ఇక్కడి బీచ్ సమీపంలో ఒకప్పుడు సందర్శకులకు కనువిందు చేసిన కళాకృతులు కనుమరుగయ్యాయి. గతంలో ఈ ప్రాంతంలో సందర్శకులను ఆకట్టుకునేందుకు 2003లో అప్పటి మున్సిపల్ చైర్మన్ డి.శైలేంద్రరెడ్డి ఆకర్షణీయమైన బొమ్మలు ఏర్పాటు చేశారు. భీమిలి చారిత్రక, ఐతిహాసిక ప్రాశస్త్యం తెలియజేసేలా ఆకట్టుకునే రీతిలో ఆకృతులను తయారు చేయించారు. పురాణాల ప్రకారం.. ఈ ప్రాంతానికి ఏకచక్రపురం అనే పేరు ఉండగా.. పాండవులు అజ్ఞాతవాసం సమయంలో ఇక్కడ ఉండటం, అదే సమయంలో బకాసురుడనే రాక్షసుడిని భీముడు సంహరించడంతో అప్పటి నుంచి ఈ ఊరికి భీమునిపట్నం అనే పేరు వచ్చినట్లు చెబుతారు. దానికి గుర్తుగా, బీచ్‌ను ఆనుకుని వారికి సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇవి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇంకా అలల సమీపంలో జలకన్య, లైట్‌హౌస్ సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహం, రోడ్డు మధ్య నాటుపడవ అందులో మత్స్యకారులు, బోయివీధి సమీపంలో ఛత్రపతి శివాజీ, బీచ్ పార్కులో పిల్లలు మొదలైన కళాకృతులు ఎంతగానో ఆకట్టుకునేవి. హుద్‌హుద్ తుఫాన్ ధాటికి ఈ బొమ్మలన్నీ కొట్టుకుపోవడంతో ఈ ప్రాంతం బోసిపోయింది. గత ప్రభుత్వంలో బీచ్‌రోడ్డు, పార్కులను అభివృద్ధి చేయగా కనుమరుగైన పాత బొమ్మలను మళ్లీ తయారు చేయించి, ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు, కాని ప్రభుత్వం మారడంతో అది జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి అలాంటి బొమ్మలను చేయించి, ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



పంచపాండవుల విగ్రహాలు సముద్రంలో కొట్టుకుపోవడంతో ఖాళీగా ఇలా..



బోయివీధి సమీపంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం



శివాజీ విగ్రహం ఉన్న చోటు ప్రస్తుతం ఇలా..



లైట్‌హౌస్ ఎదురుగా రోడ్డు మధ్యలో పడవ, అందులో మత్స్యకారుల బొమ్మ



ప్రస్తుతం బొమ్మ లేకుండా ఉన్న రోడ్డు



బీచ్ పార్కులో చిన్నపిల్లల బొమ్మలు



బీచ్ పార్కులో బొమ్మలు లేని ప్రాంతం

నేడు యోగా శిక్షణ

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం యోగాలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ సిబ్బంది, వెలుగు వీవోఏలు ఈ శిక్షణలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని తెలియజేశారు.